చేతికందే ఎత్తులో ప్రమాదం

- గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- కొండెవరంలో ఇళ్ల మీదుగా 11 కేవీ విద్యుత్ తీగలు
- ఆందోళన చెందుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

కొత్తపల్లి: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారులు, కూడళ్లలో ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీజు కటౌట్‌లకు ఎటువంటి రక్షణ కవచాలను ఏర్పాటు చేయలేదు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మార్కెట్ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. వర్షాకాలంలో ట్రాన్స్ ఫార్మర్ల నుంచి మంటలు సైతం వస్తున్నాయి.


కొండెవరం ఇందిరా కాలనీలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

తీర గ్రామాల్లో..

మండలంలోని తీరప్రాంత గ్రామాలైన ఉప్పాడ, అమీనాబాదు, మూలపేట, కోనపాపపేటతో పాటు పలు గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద ట్రాన్స్ ఫార్మర్లకు ఎటువంటి రక్షణ లేదు. పలుచోట్ల మూడు అడుగుల ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.


విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన బాలుడు (ఫైల్)

గతంలో ప్రమాదాలు

కొండెవరం ఇందిరా కాలనీలో గతంలో ఇంటి పిట్ట గోడకు ఆనుకుని ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలను గమనించక పోవడంతో ఓ విద్యార్థి మెడకు తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు తగిలి రెండు గేదెలు మృతి చెందడంతో పాటు పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లలకు రక్షణ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాద కరంగా విద్యుత్ తీగలు

కొండెవరం ఇందిరా కాలనీలో ఇళ్లపైనే 11కేవీ విద్యుత్ తీగలు ఉండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వర్షం పడితే ఇళ్లకు కూడా విద్యుత్ సరఫరా అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ తీగలు మార్చలని ఇందిరా కాలనీ ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం

కొండెవరంలో ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు మార్చేందుకు, మండలంలోని ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలను ఏర్పాటు చేసేందుకు ఎస్టిమేషన్ వేసి ఉన్నతస్థాయి అధికారులకు పంపాము. ముఖ్యంగా ప్రధాన రహదారులు, తీరప్రాంతాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మార్లకు ప్రాధాన్యత కల్పించి కంచెలను ఏర్పాటు చేస్తాం. ఫీజ్ కటౌట్‌లకు బాక్సులను ఏర్పాటు చేసి ప్రమాదం జరగని ఎత్తులో ఉంచుతాం. కొండెవరంలో తీగలను మార్చేందుకు ఎస్టిమేషన్ వేసి పంచాయతీకి పంపించాం.

ప్రమోద్, విద్యుత్ శాఖ ఏఈ, కొత్తపల్లి

కళ్లముందే ప్రాణం పోయింది



ఆడుతూ పాడుతూ కళ్లముందే తిరుగుతూ సందడి చేసే బాలుడి మేడకు విద్యుత్ తీగలు తగలడంతో అందరూ చూస్తుండగానే కళ్లముందే ప్రాణం పోయింది. ఈ ప్రమాదం జరిగి 3 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ఆ విద్యుత్ తీగలను తొలగించలేదు.

కొండపల్లి వెంకటలక్ష్మి, గృహిణి, కొండెవరం ఇందిరా కాలనీ

బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నాం



ఇళ్ల పైనే 11కేవీ విద్యుత్ తీగలు ఉండడం వలన ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నాం. వర్షాలు, తుపానుల సమయంలో విద్యుత్ తీగల నుంచి పెద్దఎత్తున మంటలు వ్యాపిస్తున్నాయి. తీగలు కింద ఉన్న వారంతా బయటకు పరుగులు పెట్టే పరిస్థితి నెలకొంది.

బి.రేవతి, గృహిణి కొండెవరం ఇందిరాకాలనీ

విద్యుత్ తీగలు మార్చాలి



కొండెవరం ఇందిరా కాలనీలో ప్రమాద కరంగా ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలను వేరే ప్రాంతానికి మార్చాలి. దీనిపై ఎన్ని సార్లు పంచాయతీ, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నా అధికారులు ప్రజల ప్రాణాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదు.

గాది సత్యవతి, గృహిణి, కొండెవరం ఇందిరా కాలనీ

కార్మికుడి ఇంట్లో చోరీ

- రూ.80 వేల విలువైన బంగారు నగలు.. రూ.92 వేల నగదు అపహరణ

సామర్లకోట: స్థానిక రాక్ సిరామిక్స్ కార్మికుడు పువ్వుల సుధాకర్ ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు అపహరణకు గురైంది. స్థానిక సత్యనారాయణపురంలో సుధాకర్, స్వరూప దంపతులు అద్దెకు ఉంటున్నారు. వేసవి తాపానికి తాళలేక సమీపంలోనే ఉన్న స్వరూప తల్లి ఇంటిలో ఏసీ ఉండడంతో మంగళవారం రాత్రి ఇంటి తలుపులకు తాళం వేసి అక్కడ నిద్రించేందుకు వెళ్లారు. ఇది గమనించిన దొంగలు మొదటి అంతస్తులోని ఇంటి తలుపుల తాళాలు, బీరువా తాళాలు పగలు గొట్టి రూ.80 వేల విలువైన బంగారు గొలుసు, రెండు ఉంగరాలు, దుద్దులు, రూ.92 వేలు నగదు దోచుకుపోయారు. రెండు బీరువాల్లోని బట్టలను కింద పడవేసి బీరువాలోను, డబ్బాలోను ఉన్న నగదు, ఆభరణాలు దోచుకుపోయారు. బుధవారం ఉదయం ఇంటికి వచ్చిన దంపతులు తలుపులు తెరిచి ఉండటం గమనించి చోరీ జరిగినట్టు గుర్తించారు. భార్యకు నల్లపూసలు చేయించేందుకు పొదుపు చేసిన మొత్తాన్ని దోచుకుపోయారని సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశాడు. వార్డు కౌన్సిలర్ సేసేని సురేష్ ఫిర్యాదు మేరకు సీఐ కె.దుర్గాప్రసాద్, ఎస్సై టి.సునీత, క్లూస్ టీమ్ బృందం సంఘటనా ప్రదేశాన్ని సందర్శించి సమాచారం సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించిన ఎస్సై సునీత

ఫిల్టర్ చెరువుకు గోదావరి జలాలు

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: గోదావరి కాలువ నీటి మట్టం పెరగడంతో బుధవారం నుంచి నాగార్జున ఫిల్టర్ చెరువులోనికి నీటిని నింపుతున్నారు. ఉండూరు రైల్వే గేటు వద్ద ఉన్న నాగార్జున చెరువులో నీటిని ఫిల్టర్ చేసి ప్రజలకు తాగు నీరు అందజేయడానికి చెరువు వద్ద ఫిల్టర్ బెడ్‌ప్లాంటు ఏర్పాటు చేశారు. గోదావరి కాలువ మూసివేయడంతో చెరువులో నీటి మట్టం తగ్గిపోవడంతో తాగు నీటి ఎద్దడి ఏర్పడింది. ఆరు రోజుల క్రితం గోదావరి జలాలు విడుదల కావడం, కాలుష్య జలాలు సముద్రంలోనికి విడిచి పెట్టడంతో స్వచ్ఛమైన నీటిని నాగార్జున చెరువులోకి నింపుతున్నట్లు ఫిల్టర్ ప్లాంటు నిర్వాహకులు తెలిపారు. చెరువులో నీటి మట్టం పెరిగితే నీటి సమస్య ఉండద న్నారు. ప్రతి ఏడాది కంటే గోదావరి కాలువకు నీరు ముందుగా రావడంతో ఈ ఏడాది నీటి సమస్య లేకుండా చేసినట్టు మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ తెలిపారు.


నాగార్జున చెరువులోకి చేరుతున్న గోదావరి జలాలు

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

పిఠాపురం: రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన వరి విత్తనాలు అందించాలని డీలర్లకు పిఠాపురం ఏడీఏ పి.స్వాతి సూచించారు. పిఠాపురం పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాలకు చెందిన డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలను ముందుగా పరిక్షించి 80 శాతం కన్నా ఎక్కువ మొలకెత్తిన విత్తనాలనే రైతులకు సరఫరా చేయాలన్నారు. నాణ్యమైన విత్తనాలతో పాటు పురుగు మందులు, ఎరువులు అందించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ, ఎంవోపీ, ఎస్ఎస్‌పీతో పాటు కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు ఎ.అచ్యుత రావు, సత్యనారాయణ, వి.జోగిరాజు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ స్వాతి

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

ఆర్జేడీ ఉమారాణి

కాకినాడ సిటీ: అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులతో పాటు ఆధునిక సౌకర్యాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, వీటిని స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించేలా జిల్లా, మండల స్థాయి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ఏలూరు రేంజి ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు కె.ఉమారాణి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలోని విధానగౌతమి కార్యాలయంలో కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని సీడీపీవో, సూపర్‌వైజర్స్‌తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. సివిల్ వర్క్స్, ఎస్‌డీజీ ఇండికేటర్స్, సివిల్ సప్లై స్టాక్స్, పాలు, గుడ్లు, బాలామృతం, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు, పథకాలకు సంబంధించి పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాలల హక్కుల రాష్ట్ర కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టడానికి జిల్లా స్థాయి నుంచి మండల, గ్రామ స్థాయి వరకు గ్రామ బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేసి బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. జిల్లా ప్రాజెక్టు అధికారి కె.ప్రవీణ మాట్లాడుతూ జిల్లాలో నాడు–నేడు రెండో దశ కింద మంజూరైన అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను ఇంజినీరింగ్, సచివాలయ సిబ్బంది సహకారంతో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. స్థానికంగా ఉన్న సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పునాది స్థాయిలో ఉన్న భవనాలను వారం రోజుల్లో రూఫ్ స్థాయికి నిర్మించేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం నోడల్ అధికారి లక్ష్మి, రెండు జిల్లాల పరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాల సీడీపీవో, సూపర్‌వైజర్లతో మాట్లాడుతున్న ఆర్జేడీ ఉమారాణి

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడం తగదు

కొత్తపల్లి: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడం తగదని అఖిల భారత కార్మిక సంఘాల సభ్యుడు, పిఠాపురం డివిజన్ అధ్యక్షుడు డి.నారాయణమూర్తి అన్నారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో బుధవారం ఉపాధి హామీ కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ ప్రతి కూలీకి 200 రోజులు ఉపాధి పనులు కల్పించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సంఘ ప్రధాన కార్యదర్శి కుంచే అంజిబాబు మాట్లాడుతూ అనేక పోరాటాలు ఫలితంగా సాధించిన ఉపాధి హామీ చట్టానికి ప్రధాని మోదీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందన్నారు. విడతల వారీగా ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గిస్తోందన్నారు. కార్యక్రమంలో దిమ్మల లోవరాజు, బత్తిన కుమారి, ఎద్దు నాగమ్మ, సిద్ధాంతపు కొండమ్మ తదితరులు ఉన్నారు.


దుర్గాడలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కార్మికులు

బాబోయ్ ఎండలు


నిర్మానుష్యంగా సామర్లకోట-వేట్లపాలెం కెనాల్ రోడ్డు

సామర్లకోట: ఎండలు మండిపోతున్నాయి. ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. బుధవారం 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడంతో చీకటి పడినప్పటికీ వడగాల్పులు తగ్గలేదు. నిత్యం రద్దీగా ఉండే స్టేషన్ సెంటర్, ఫ్లైఓవర్ బ్రిడ్జి, కెనాల్ రోడ్డు నిర్మానుష్యంగా మారాయి.

వన్ వేపై నిర్ణయం ఎప్పుడో ?

- పాఠశాలలు తెరిచేనాటికి అమలయ్యేనా
- ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు సతమతం

సామర్లకోట: పెద్దాపురం–సామర్లకోట ఆర్అండ్‌బీ రహదారి విస్తరణ పనులు పూర్తయినా వన్‌వే అమలు చేయడం లేదు. దాంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. సామర్లకోట నుంచి పెద్దాపురం, ప్రతిపాడు, పిఠాపురం వైపు వెళ్లే వాహనాల పెద్దాపురం రోడ్డులో, పెద్దాపురం, పిఠాపురం, ప్రత్తిపాడు ప్రాంతాల నుంచి సామర్లకోట వచ్చే వాహనాలు పిఠాపురం రోడ్డులో రావాల్సి ఉంది. అయితే రహదారి విస్తరణ పనులతో కొంత కాలం వన్‌వే నిబంధనలు పక్కనపెట్టారు. నిత్యం రద్దీగా ఉండే మఠంసెంటర్‌లో రహదారి వెడల్పు చేయలేదు. దాంతో ఆ ప్రాంతం ఇరుకుగా ఉండి భారీ వాహనాలు వచ్చే సమయాల్లో ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి.

పాఠశాలలు తెరిచే వేళాయే..

ఈ నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు తెరుస్తున్న నేపథ్యంలో చిన్నారులకు ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది. మఠం సెంటర్ కూడలి నుంచి బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌కు ప్రమాదకర పరిస్థితుల్లో విద్యార్థులు రాకపోకలు సాగించాల్సి ఉంది. అలాగే పిఠాపురం రోడ్డులో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్, మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలు ఉన్నాయి. ఈ రోడ్డులోను ఒన్‌వే అమలు కాక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.


పెద్దాపురం రోడ్డులో మఠంసెంటర్ వద్ద ఎదురు ఎదురుగా వస్తున్న వాహనాలు

కాన రాని పోలీసు సిబ్బంది..

ఫ్లైఓవర్ బ్రిడ్జిపై విధులకు ట్రాఫిక్ కానిస్టేబుళ్లు పోటీపడుతున్నారు తప్ప మిగిలిన ప్రాంతాల్లో కనపడడం లేదు. కాకినాడ రోడ్డులో ఫ్లైఓవర్ దిగువ భాగంలో రైల్వే గూడ్స్ షెడ్ ఉంది. వివిధ రకాల సరకులతో గూడ్స్ వేగన్లు వస్తే ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. తిమ్మాపురం, ఇంద్రపాలెం పోలీసు స్టేషన్ల పరిధిలో ఉండే గ్రామాలను సామర్లకోట పోలీసు స్టేషన్‌లో విలీనం చేసినా సిబ్బంది సంఖ్యను పెంచలేదు.

వన్‌వేపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం...



స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి స్టేషన్ సెంటర్ వరకు గతంలో ఉండే వన్‌వేపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం. వన్ వేపై వాహన చోదకులకు అవగాహన కల్పిస్తాం.

– అడపా గరగారావు, ట్రాఫిక్ ఎస్సై, సామర్లకోట

క్లుప్తంగా

నేడు విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సామర్లకోట: స్థానిక నీలమ్మ చెరువు వద్ద యున్న ఉమా మార్కండేయేశ్వర సహిత భద్రావతి సమేత భావనారుషి స్వామి ఆలయంలో గురువారం శివలింగం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సంజీవ ఆంజేయ స్వామి, చండీశ్వర విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ట నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. ఈ మేరకు వేద పండితులు దేవులపల్లి ఫణి రామకృష్ణ శర్మ, అళ్లకి వెంకటజోగేశ్వరశర్మ, చేబ్రోలు వెంకట సూర్యసుబ్రహ్మణ్యప్రసాద్, సాయి నాగ ప్రసన్న గణపతి మార్కండేయ శాస్త్రిల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు పూజలు, హోమాలు జరిగాయి.

జైగణేష్ ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పిఠాపురం: పట్టణంలోని కోటగుమ్మం సెంటర్‌లో వేంచేసిన జైగణేష్ ఆలయంలో బుధవారం సంకటహార చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ పండితులు స్వామి వారికి పంచామృత అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శృంగార వల్లభుని ధ్వజస్తంభ ప్రతిష్ఠ


ధ్వజ స్తంభ ప్రతిష్ఠలో పూజలు నిర్వహిస్తున్న పండితులు, ఈఓ


పెద్దాపురం: తొలి తిరుపతి, స్వయంభూ శృంగార వల్లభ స్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ బుధవారం వైభవంగా సాగింది. చదలాడ గ్రామానికి చెందిన ఉండవల్లి వారి కుటుంబ సభ్యులు, భక్తుల సహకారంతో ఏర్పాటు చేసిన ధ్వజస్తంభాన్ని దేవదాయ శాఖ జిల్లా అధికారి, ఇన్‌చార్జి ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ మహోత్సవానికి ఆయా గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

జెడ్పీటీసీలకు ముగిసిన శిక్షణ


జెడ్పీటీసీ సభ్యులకు సర్టిఫికెట్లు అందజేసిన అధికారులు

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో జెడ్పీటీసీ సభ్యులకు శిక్షణ కొనసాగుతోంది. ముగింపు శిక్షణలో ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని సభ్యులకు ఇచ్చిన సమచారంతో కూడిన పుస్తకాలను పూర్తిగా చదవాలని సూచించారు. పరిపాలన విధానంపై అవగాహన ఉన్నప్పుడు మాత్రమే అధికారులను ప్రశ్నించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. వివిధ అంశాలపై ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ ఈ.కృష్ణమోహన్, హౌసింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజు, ఈటీసీ ఫ్యాకల్టీలు శ్రీదేవి, ప్రసాద్, ఎంఎస్ఎన్ రెడ్డిలు శిక్షణ నిర్వహించారు. అనంతరం సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు.

క్రీడలపై ఆసక్తి అవసరం


ఆటలు ఆడుతున్న విద్యార్థులు

పెద్దాపురం: విద్యార్థులు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని గ్రంథాలయ అధికారి పాలంకి నాగరాజు అన్నారు. బుధవారం శాఖా గ్రంథాలయంలో సిబ్బంది సింగం బుల్లియ్య అధ్యక్షతన జరిగిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ శిబిరాలు దోహదపడతాయన్నారు. అనంతరం విద్యార్థులతో ఆటలు ఆడించారు. గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

ఆత్మీయ స్వాగతం..


మలికిపురం మండలం కత్తిమండలో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కుమారుడి వివాహానికి బుధవారం వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని హెలిప్యాడ్ వద్ద మర్యాదపూర్వకంగా కలసి అభినందిస్తున్న రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు.

నేడు శ్మశానంలో శివుని విగ్రహం ఏర్పాటు


శ్మశానంలో ఏర్పాటు చేయనున్న శివుని విగ్రహం

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప శ్మశాన వాటికలో గురువారం గ్రామ సర్పంచి పాలాని దొరబాబు ఆధ్వర్యంలో శివుని విగ్రహాన్ని ఏర్పాటు ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా బుధవారం విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. పండితులు విగ్రహానికి పూజలు చేశారు.

పథకాల అమలులో వలంటీర్లే కీలకం


కార్యక్రమంలో మాట్లాడుతున్న దవులూరి

పెద్దాపురం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని తాటిపర్తి గ్రామంలో గ్రామ సర్పంచ్ గోపు సూర్యక్రాంతి అధ్యక్షతన బుధవారం వలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేశారు. దొరబాబు ముఖ్య అతిథిగా హాజరై సేవా సైనికులు వలంటీర్లు అని అన్నారు. అనంతరం జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణలతో కలసి తాటిపర్తి, చంద్రమాంపల్లి గ్రామ సచివాలయ వలంటీర్లకు శాలువాలు కప్పి, ప్రశంసాపత్రాలను, మెడల్స్‌తో దొరబాబు సత్కరించారు. తాటిపర్తి గ్రామంలో 33 మంది లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల పట్టాలను దొరబాబు పంపిణీ చేశారు. వైఎస్సార్ మండల యూత్ మాజీ అధ్యక్షుడు గోపు మురళి, గుడివాడ సర్పంచ్ కనపర్తి చీమదొర, సుందరెడ్డి రాజు, లక్కాకుల కృష్ణ, ఇడుసుమల్ల సాచి తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసిన వ్యక్తికి రిమాండ్

సామర్లకోట: స్థానిక గాంధీనగర్‌కు చెందిన గుర్రాన భరతమాత అనే మహిళను మోసం చేసిన సంఘటనలో నిందితుడికి రిమాండ్ విధించారు. పోలీసుల కథనం ప్రకారం భరతమాతను వీరేటి సత్యనారాయణ అనే వ్యక్తి పరిచయం చేసుకొని నమ్మించి ఆమె ఇంటిని విక్రయించి వచ్చిన సొమ్ము ఇవ్వకుండా మోసానికి పాల్పడినట్టు ఫిర్యాదు చేసింది. భరతమాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేసి బుధవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు.

ఆలయనిర్మాణానికి భూమిపూజ

కరప: మండలం వేళంగి గ్రామ దేవతలైన మారెమ్మ, పాలమ్మతల్లి ఆలయ నిర్మాణానికి బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. గ్రామస్తుల వినతిమేరకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.10 లక్షలు మంజూరుచేయగా, గ్రామస్తుల విరాళాలతో ఆలయ నిర్మాణం చేస్తున్నట్టు సర్పంచ్ సవిలే నీలిమ తెలిపారు.